



అక్కినేని అఖిల్ వెడ్డింగ్ రిసెప్షన్ సందడితో ఆదివారం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియో కళకళలాడింది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహేష్‌బాబు దంపతులు, రామ్‌చరణ్ దంపతులు, కోలీవుడ్ హీరో సూర్య తదితరులు ఈ కార్యక్రమానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ నెల 6న నాగార్జున నివాసంలో అఖిల్, జైనబ్ రవ్జీల వివాహం జరిగిన విషయం తెలిసిందే.




# బాలయ్య బర్త్‌డే కానుకలు



ఓ వైపు వరుస విజయాలు.. మరోవైపు జాతీయ పురస్కారాలు.. బాలకృష్ణకు ప్రస్తుతం మహర్దశ నడుస్తున్నది. ఆయన రానున్న సినిమా 'అఖండ 2: తాండవం'పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే, విడుదలైన తొలివారంలోనే బ్రేక్ ఈవెన్ అయినా ఆశ్చర్య పడక్కర్లేదు. బాలకృష్ణ కెరీర్‌లో తొలి పానిండియా సినిమాగా 'అఖండ 2: తాండవం' రానుంది. రేపు బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా 'అఖండ 2: తాండవం' టీజర్ నేడు విడుదల కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. నంది, ఢమరుకంతో కూడిన త్రిశూలాన్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 25న దసరా కానుకగా విడుదల కానుంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అలాగే బాలకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకొని ఆయన 111వ చిత్రానికి సంబంధించిన ప్రకటన కూడా వచ్చేసింది. బాలయ్యతో బ్లాక్‌బస్టర్ 'వీరసింహారెడ్డి'ని తెరకెక్కించిన గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వెంకట్ సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఉగ్రసింహాన్ని, ఓ లోహ కవచాన్నీ పోస్టర్‌లో చూపిస్తూ మాస్ మెచ్చేలా పోస్టర్‌ని డిజైన్ చేశారు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఎపిక్ స్టోరీగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి మాటలు: సాయి మాధవ్ బుర్రా.

# ఎన్నికైన 24గంటల్లోనే TFCC అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా



**తెలంగాణ** ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(TFCC) అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు అగ్ర నిర్మాత సునీల్ నారంగ్ ప్రకటన విడుదల చేశారు. పదవి స్వీకరించిన 24 గంటల్లోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం సర్వత్ర చర్చనీయాంశమైంది. టీఎఫ్‌సీసీ కొత్త పాలక మండలిని శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రకటించిన విషయం విదితమే. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి మూడవ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్ ఎంపికగాకా, కార్యదర్శిగా శ్రీధర్ వి.ఎల్. ఖరారయ్యారు. ఇంకా 15మంది కార్యనిర్వాహక సభ్యులను కూడా ఎన్నుకున్నారు. శనివారం జరిగిన సమావేశంలో సునీల్ నారంగ్ సినీ పరిశ్రమపై పాజిటీవ్‌గా స్పందించారు. అందరూ అనుకుంటున్నట్టు పరిశ్రమలో 'ఆ నలుగురు' లేరని, యజమానుల వద్దే థియేటర్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హీరోలు దేవుళ్ల లాంటి వారని, వారికి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం ఏ నిర్మాతగానీ, ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్‌గానీ చేయరని ఆయన వ్యాఖ్యానించారు. అగ్ర హీరో పవన్‌కల్యాణ్ తుఫాన్ లాంటివారని, ఆయన సినిమాను ఆపే దమ్ము ఎవరికీ లేదని సునీల్ నారంగ్ పేర్కొన్నారు. అయితే.. ఈ సమావేశంలోనే కార్యదర్శిగా ఎంపికైక శ్రీధర్ వి.ఎల్ అందుకు పూర్తి విరుద్ధం స్పందించారు. పర్సంటేజ్ విధానం రావాలని, సింగిల్ థియేటర్లను కాపాడుకోవాలని ఆయన చెబుతూనే, బంద్ ప్రస్తావన తామెప్పుడూ తేలేదని, ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలు కావాలనే దీన్ని ఇష్యూ చేశారని, వారి పేర్లు త్వరలో వెల్లడిస్తానంటూ వివాదానికి తెరలేపారు. హీరోలు రెండేళ్లకో సినిమా చేయడం, మితం లేకుండా పారితోషికాలు అందుకోవడం.. సినిమా పరిశ్రమ ఇబ్బందుల పాలవ్వడానికి ప్రధాన కారణాలని ఆయన దుయ్యబట్టారు. ఒకే సమావేశంలో కొత్తగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శుల పొంతన లేని స్పందనలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో.. సమావేశం జరిగి 24 గంటలు గడవకముందే అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా చేస్తూ ప్రకటన విడుదల చేశారు. తనని సంప్రదించకుండానే కొందరు ప్రకటనలు ఇస్తున్నారని, తన ప్రమేయం లేకుండా ఇచ్చే ప్రకటనలకు తాను బాధ్యుడ్ని కానని, ఇలాంటి పరిస్థితుల్లో ఈ పదవిలో తాను కొనసాగలేనని సునీల్ నారంగ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎల్లమ్మ జాతరకు రంగం సిద్ధం



**షూటింగ్** ఇంకా మొదలుకాలేదు. నటీనటులెవరో పూర్తిగా ఖరారు కాలేదు. హీరో నితిన్ అంటున్నారు. హీరోయిన్‌గా కీర్తి సురేశ్ ఖరారైందంటున్నారు. అధికారికంగా మాత్రం ఇప్పటివరకూ ఏ ప్రకటనా రాలేదు. కానీ.. 'ఎల్లమ్మ' సినిమాపై అంచనాలు మాత్రం ఆకాశంలో ఉన్నాయి. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలో మొదలు కానుంది. నిర్మాత దిల్‌రాజు 'బలగం' సినిమాకోసం వేణుకు లిమిటెడ్ బడ్జెట్ మాత్రమే ప్రొవైడ్ చేశారు. కానీ 'ఎల్లమ్మ'కు మాత్రం అన్ లిమిటెడ్ బడ్జెట్ అంటున్నారట. ఆ కథను దిల్ రాజు అంత నమ్మారన్నమాట. రంగస్థల కళాకారుల నేపథ్యంలో ఓ గ్రామదేవత చుట్టూ ఈ కథ నడుస్తుందని సమాచారం. దర్శకుడు బలగం వేణు.. ఈ సినిమా విషయంలో పగడ్బందీగా వ్యవహరిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. తన కథ, కథనాలు ఏ మాత్రం బయటకు పొక్కకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారట బలగం వేణు. షూటింగ్ మొదలయ్యాక లొకేషన్‌లో సెల్ ఫోన్లు కూడా ఉండటానికి వీల్లేదని తన టీమ్‌కు హుకుం జారీ చేశారట. స్క్రిప్ట్ విషయంలో వేణు చాలా సంతృప్తితో ఉన్నారని, త్వరలోనే షూటింగ్ మొదలు పెట్టబోతున్నారని సమాచారం. ఇదిలావుంటే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హీరో నితిన్ 'ఎల్లమ్మ' గురించి మాట్లాడారు ' ఎంత ఎఫర్ట్ పెడితే అంత పేరు తెచ్చిపెట్టే కథ 'ఎల్లమ్మ'. ఇందులో హీరోగానో, స్టార్‌గానో కాక ఒక నటుడిగా పనిచేస్తున్నా.' అని చెప్పారు. ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా సంభాషణలు రాస్తున్న విషయం తెలిసిందే. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సివుంది.

# లేడీ మాఫియా డాన్‌గా



బాలీవుడ్‌లో 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నది మహానటి కీర్తి సురేశ్. ఇందులో ఈమె ఓ మాఫియా డాన్‌గా కనిపిస్తుందట. రీసెంట్‌గా ఈ విషయంపై బాలీవుడ్ మీడియా కీర్తి సురేశ్‌ని ప్రశ్నించింది. కీర్తి మాట్లాడుతూ 'ఇదొక ఛాలెంజింగ్ రోల్. నటిగా నాకు మాత్రమే ఇలాంటి పాత్రలు దక్కడం అదృష్టం. ఇందులో నా గెటప్, శారీరక భాష పెక్యులర్‌గా ఉంటాయ్. దర్శకుడు ధర్మరాజ్ శెట్టి అద్భుతమైన కాన్సెప్ట్‌తో 'అక్క'ను తీర్చిదిద్దుతున్నారు. కథానుగుణంగా రాధికా ఆప్టే ఈ సిరీస్‌కి కథానాయిక. మరి 'అక్క' ఎవరు? అనే విషయం మాత్రం సస్పెన్స్.' అంటూ అందంగా నవ్వేసింది కీర్తి సురేశ్. ప్రతిష్టాత్మక యష్ రాజ్ ఫిల్మ్స్ పతాకంపై ఈ సిరీస్ రూపొందుతున్నది.



# సునీల్ ద్విభాషాచిత్రం

**ప్రముఖ** దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఓ ద్విభాషా చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమాలో నటుడు సునీల్ కీలక పాత్ర పోషించనున్నట్టు ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇందులో సునీల్ పోషించనున్న పాత్ర చాలా ప్రత్యేకమైనదని, హాస్యంతోపాటు హృద్యమైన భావోద్వేగాల కలగలుపుగా ఈ పాత్ర డిజైన్ చేయడం జరిగిందని, సునీల్‌లోని కొత్త కోణం ఆవిష్కృతమయ్యేలా ఈ పాత్ర ఉంటుందని, ఈ నెల 15న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టైటిల్‌ని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేయనున్న ఈ చిత్రం రఫ్ నోట్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితం కానున్నది.

# విడుదలకు సమాయత్తమవుతున్న సర్దార్ 2



**తమిళ** అగ్ర హీరో కార్తీ కథానాయకుడిగా వచ్చిన 'సర్దార్' చిత్రం తెలుగులో కూడా మంచి విజయం సాధించిన విషయం విదితమే. ఆ సినిమాకు కొనసాగింపుగా రూపొందుతున్న 'సర్దార్ 2' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీం అందరూ కలిసి సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలని మేకర్స్ విడుదల చేశారు. ప్రీక్వెల్‌ని మించేలా ఈ సీక్వెల్ ఉంటుందని, 'సర్దార్'గా మరోసారి కార్తీ నట విశ్వరూపాన్ని ప్రేక్షకులు చూస్తారని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రీక్వెల్‌ని తెరకెక్కించిన పిఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌కి కూడా దర్శకుడు. ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్ శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.

# 70ఏండ్ల వయసులో గోడ దూకి..



**బాలీవుడ్** నట దిగ్గజం అనుపమ్‌ఖేర్‌కి రీసెంట్‌గా అనుకోని చిక్కు వచ్చిపడింది. 70ఏండ్ల వయసులో గోడ దూకి షూటింగ్‌కి అటెండ్ కావాల్సిన పరిస్థితి తలెత్తిందాయనకు. ఈ విషయం గురించి అనుపమ్‌ఖేర్ తన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. 'ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న 'ది రాజాసాబ్' సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్ వచ్చాను. షూటింగ్ లొకేషన్‌కి కారులో బయల్దేరాను. డ్రైవర్ ఓ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కారు ఆపేశాడు. అక్కడ్నుంచి ముందుకెళ్లడానికి కానీ, వెనక్కి రావడానికి కానీ లేదు. షూటింగ్ జరుగుతున్న ప్రాంతం పక్కనే అవ్వడంతో గోడ దూకి సెట్‌కి వెళ్లాను. నా 40ఏండ్ల కెరీర్‌లో ఎన్నో షూటింగ్ లొకేషన్లకు వెళ్లాను. కానీ గోడ దూకి వెళ్లింది మాత్రం 'ది రాజాసాబ్' కోసమే. ఇదో కొత్త అనుభవం. తలచుకుంటే కామెడీగా ఉంది.' అంటూ స్పందించారు అనుపమ్‌ఖేర్.

# చెట్టు చాటుకెళ్లి దుస్తులు మార్చుకోమన్నారు..



**దేశానికి** గర్వకారణమైన నటీమణుల్లో శోభన ఒకరు. నాట్యానికి జీవితాన్ని అంకితం చేసి, వైవాహిక జీవితాన్ని సైతం త్యాగం చేసిన గొప్ప కళాకారిణి శోభన. ఇటీవలే ఆమె 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ఇంటరాక్ట్ అయిన శోభన.. కొన్నేళ్ల క్రితం షూటింగ్‌లో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. ' 'కల్కి' సినిమాలో అమితాబ్ సార్‌తో కలిసి నేను నటించిన విషయం అందరికీ తెలిసిందే. కానీ అంతకు ముందే ఆయనతో నేనొక సినిమా చేశా. అయితే.. అందులో నేను హీరోయిన్‌ని కాదు. ఓ ప్రత్యేక గీతంలో నర్తించానంతే. అహ్మదాబాద్‌లో ఆ పాట షూటింగ్ జరిగింది. ఆ రోజును జీవితంలో మర్చిపోలేను.ఆ ఒక్క పాటలోనే నేను చాలా కాస్ట్యూమ్స్ మార్చుకోవాల్సివుంది. అమితాబ్ కోసం ప్రత్యేకంగా కారవాన్ తెప్పించారు. నాకు కారవాన్ లేదు. అమితాబ్ షూటింగ్ అవుడ్డోర్‌లో కావడంతో ఆయన్ను చూసేందుకు జనం విరగబడ్డారు. ఎటు చూసినా జనమే. డ్రెస్ మార్చుకోవాలి ఎలా? చేసేది లేక చిత్ర బృందాన్ని అనడిగాను. వారిలో ఓ వ్యక్తి.. 'ఆమె కేరళ నుంచి వచ్చింది.. అక్కడి వాళ్లు దేనికైనా సర్దుకుపోతారు.. ఆ చెట్టు వెనక్కెళ్లి మార్చుకోమను..' అనేశాడు. నాకు కళ్లవెంట నీళ్లు తిరిగాయి. ఆ వ్యక్తి మాట్లాడిన మాటలు వాకీ టాకీలో అమితాబ్ విన్నారు. పట్టరాని కోపంతో కారవాన్ నుంచి బయటకొచ్చి, అతన్ని పిచ్చి తిట్లు తిట్టారు. ఆ క్షణం అమితాబ్‌ని చూస్తే నాకు చెప్పలేనంత భయం వేసింది. చివరకు తన కారవాన్ నాకిచ్చి, ఆయన బయటే కూర్చున్నారు. ఆ క్షణాలు నేనెప్పటికీ మరిచిపోలేను. ఇన్నాళ్లకు మళ్లీ 'కల్కి' సినిమా పుణ్యమా అని ఆయనతో వర్క్ చేసే అవకాశం దొరికింది. లొకేషన్‌లో ఎవరైనా తన వద్దకు వస్తే, లేచి నిల్చొని విష్ చేస్తారాయన. స్టార్‌గా ఇండియాలో అమితాబ్ స్థాయి ఎవరికీ లేదు. కానీ ఆయన ఒదిగి ఉంటారు. సంప్రదాయాలకు, సంస్కృతికి విలువిస్తారు.' అంటూ చెప్పుకొచ్చారు శోభన.

# అంతుచిక్కని ఓ రహస్యం



**ఆదిసాయికుమార్** హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల'. 'ఏ మిస్టికల్ వరల్డ్' ఉపశీర్షిక. యుగంధర్ ముని దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలెన్నో ఉన్నాయి. సమాధానం దొరకనప్పుడు సైన్స్ దాన్ని మూఢ నమ్మకం అంటుంది. దొరికితే అదే తన గొప్పదనం అంటుంది' అనే సంభాషణతో మొదలైన టీజర్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. విజువల్స్, బీజీఎమ్ హైలైట్‌గా నిలిచాయి. అంతరిక్షం నుంచి అతీంద్రియ శక్తి కలిగిన ఓ ఉల్క గ్రామంలో పడటం, జనాలు చనిపోవడం, కొందరు వింతగా ప్రవర్తించడం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఉత్కంఠను పెంచింది. మిస్టిక్ థ్రిల్లర్ చిత్రమిదని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని మేకర్స్ పేర్కొన్నారు.

# ఆశ్చర్యపరిచే పయనం



**సుప్రజ్, సంగీర్తన** విపిన్ జంటగా, చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్న 'పయనం' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచాన్ చేశారు. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందనున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇదని, ఆడియన్స్‌ని ఆశ్చర్యపరిచే అంశాలు ఇందులో పుష్కలంగా ఉంటాయని దర్శకుడు చెప్పారు. జూలై 7 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని, మంచిర్యాల, తమిళనాడు, ఒరిస్సా పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతామని నిర్మాత తెలిపారు. అవసరాల శ్రీనివాస్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో ఆమని, మైమ్ మధు, మెహబూబ్ భాషా తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి రచనా సహకారం, మాటలు, స్క్రీన్‌ప్లే: వీరారెడ్డి, సతీష్ కుమార్ మూల, కెమెరా: షోయబ్, సంగీతం: రఘు కుంచె, నిర్మాణం: ఛాయ చిత్రాలు.